❖•❖•❖ 65 ❖•❖•❖

# మేకులు కొట్టబడిన చేతులు

*“నేనే ఆయనను అనుటకు నా చేతులను నా పాదములను చూడుడి; నన్ను పట్టి చూడుడి; నాకున్నట్టుగా మీరు చూచుచున్న యెముకలును మాంసమును భూతమునకుండవు” (లూకా 24:39).*

నీవు మృతులలో నుండి లేచి నీవు సజీవుడవై యున్నావని నీ స్నేహితులకు చూపించుకొనగోరినట్లయితే, నీవు నీ పునరుత్థానమును వారికి ఎట్లు ప్రదర్శిస్తావు? ఆయన పునరుత్థానుడైన మొదటి ఆదివారంనాటి సాయంకాలము మేడగదిలో, మరణించి యుండిన ఆయన ఇప్పుడు సజీవుడై యున్నాడని రుజువుపర్చుటకు నిదర్శనములుగా యేసు ఉభయార్థసాధకమగు రెండు ఉపాయములను ఉపయోగించాడు అనుభూతి చెందుట మరియు సహవసించుట.

యేసు తన శిష్యులకు ప్రత్యక్షమైన ఈ సందర్భములో, వారు ఒక భూతమును చూచుచుండిరని ఆయన పునరుత్థానుడైనది మొదలుకొని అప్పటి వరకు ఆయనను యింకా చూడనివారు అనుకొన్నారు. వారి ఆలోచనలను అర్థంచేసికొని, ఆయన, “మీరెందుకు కలవరపడుచున్నారు? మీ హృదయములలో సందేహములు పుట్టనేల? నేనే ఆయనను అనుటకు నా చేతులను నా పాదములను చూడుడి నన్ను పట్టి చూడుడి” (లూకా 24:38, 39). యోహాను, “ఆయన ... వారికి తన చేతులను ప్రక్కను చూపెను” అని చెప్పుచున్నాడు (యోహాను 20:20ఎ). ఆయనను ముట్టుకొని ఆయన నిజముగా వారితో కూడా ఉన్నాడని రూఢిపర్చుకొనుటకు ఇవ్వబడిన ఈ ఆహ్వానముచేత, శిష్యులు విపరీతమైన ఆశ్చర్యముతో నిండిపోయారు. ఆయన వారితో కూడ భౌతికంగా ఉన్నాడను సత్యమును వారు సంపూర్తిగా అవగాహన చేసికొనలేదు.

“అయితే వారు సంతోషముచేత ఇంకను నమ్మక ఆశ్చర్యపడుచుండిరి” అని లూకా చెప్పుచున్నాడు (లూకా 24:41ఎ). అప్పుడు మన ప్రభువు నిదర్శన సంబంధమైన తన రెండవ విధానమును, భౌతికంగా సహవసించుటను ఉపయోగించుకొన్నాడు. తినడానికి ఏమైన ఇవ్వవలెనని వారినడిగాడు, వారొక కాల్చిన చేప ముక్కను ఆయనకిచ్చారు. ఆయన దానిని వారి కళ్ల యెదుటనే అరగించాడు. భౌతికంగా ఆయన హస్తములను మరియు పాదములను ముట్టుకొనుచు రక్షకుడు వారి యెదుటనే చేప ముక్కను ఆరగించుటను గమనించుట ద్వారా, వారు ఆయన పునరుత్థానుడయ్యాడనుటకు అమితాశ్చర్యంతో నిండుకొనిన నిదర్శనమును అనుభూతి చెందారు. వారిలో ఏ ఒక్కరును దానిని కాదనలేకపోయారు.

ఈ సన్నివేశము ఎలా ఉండియుంటుందో నీవూహించుకొనగలవా? మేకులు కొట్ట బడిన యేసు హస్తములను తాకుటవలన కలుగు అనుభూతి ఎలా ఉంటుందో మనలో ఎవరమైనా చిత్రీకరించుకొనగలమా? మరియు పాదములలోని గాయముల మచ్చలు మాత్రమే. ఆ గాయముల మచ్చలు చూస్తే సరిపోతుంది, కానీ వాటిని స్పృశించగలుగుట ప్రత్యేకార్హతలన్నిటిలోకెల్లా ఒక విశిష్టమైన ప్రత్యేకార్హతయై యుండినది.

అలాగైతే కొట్టబడిన మేకులు చేసిన గాయముల మచ్చలు కలిగియుండిన యేసు హస్తములు వాటిని అదే పనిగా చూచుచుండినవారికి ఏమి బోధించుచుండినవి? వాటిని గూర్చి చదువుచుండు మనకు అవి ఏమి తెలియజేస్తాయి? సిలువవేయబడినప్పుడు చేయబడిన గాయముల మచ్చలను యేసు తన శిష్యులకు చూపించకుండా ఎన్నడూ దాచిపెట్టుకొనలేదు. తన గాయపు మచ్చలను ఆయన సహచరులు చూచి అవి బోధించు పాఠములను నేర్చుకొనవలెనని ఆయన ఆశించాడు మరియు అనుమతించాడు.

*మొదటిగా, మేకులు కొట్టబడిన యేసు హస్తములు ఆయన సిలువవేయబడినాడని రుజువుచేశాయి.* యేసు భౌతిక శరీరంతో సిలువకు కొట్టబడినాడు. ఆయన శరీరములో

ఉండిన అత్యధిక శాతం రక్తం ఆయనలో నుండి కారిపోవునంత వరకు ఆయన సిలువ మీదనే వ్రేలాడాడు. ఆయన ప్రక్క ఒక బరిసెతో పొడవబడింది. ఘోరాతిఘోరమైన విధంగా సిలువవేయబడునట్లు, ఆయన మన పాపముల నిమిత్తము తనను తాను అప్పగించుకొన్నాడు. యేసు గాయపడిన హస్తములను తన శిష్యులకు చూపించుచుండినప్పుడు, ఆయన, "సిలువ మీద మరణించినవాడను నేనే. మీరు నా హస్తములలో గల మేకుల అచ్చులను స్వయంగా తాకుట ద్వారా ఇది నిజమని మీరు నిర్ధారించుకొనవచ్చును" అని వారితో చెప్పుచుండెను. ఆయన శరీరములో గల సిలువ శ్రమల గుర్తులను ఆయన శిష్యులు చూచుట మాత్రమేగాక ముట్టుకొనవచ్చునని కూడ వారికి అనుమతినిచ్చాడు. ఆయన సిలువవేయబడినాడని ఆయన హస్తములే రుజువుచేశాయి!

*రెండవదిగా, ఆయన మరణమును జయించాడని అవి రుజువుచేశాయి.* యేసు వారి యెదుట మర్త్య శరీరమునకుండు గాయములు గల భౌతిక శరీరముతో నిలువబడి యుండెను, అట్లయినను ఆయన సజీవుడే. యేసు వారి మధ్యన నిలువబడి, "రండి, నా హస్తములను మరియు పాదములను పట్టుకొని చూడండి" అని వారికి చెప్పుట ఆయన పునరుత్థానుడయ్యాడనియు మరణమును జయించాడనియు ఒకరిని ఒప్పించుటకు అత్యధికంగా బలమైన రుజువై యుండెను.

మేడ గదిలో నుండినవారిలో కొందరు యేసు సిలువవేయబడుచుండగా చూశారు. ఆ సమయంలో ఆయన అనుభవించిన పైశాచికమును, బీభత్సకరమైనదియు, బాధాయుతమైనదైన వ్యవహారమంతటిని వారు కళ్లారా చూశారు. నిస్సందేహంగా, కొద్దిమంది, ఆయన తన ప్రాణము విడుచునంత వరకు సిలువ యొద్దనే ఉండిపోయారు. అరిమతయియ యోసేపు మరియు నీకొదేము యేసు దేహమును సిలువమీద నుండి దింపి క్రొత్తగా తొలిపింపబడిన రాతి సమాధి యొద్దకు ఆ దేహమును మోసికొని వెళ్లుచుండుగా సమాధి యొద్దకు వచ్చిన స్త్రీలలో కొందరు వారి వెంట వెళ్లారని లూకా చెప్పుచున్నాడు (లూకా 23:55). గనుక ఇక ఎటువంటి అనుమానముండదు, అపార్థముండదు. వారి యెదుట నిలువబడియుండినవాడు ఆయన సిలువవేయబడుచుండగా వారు చూచిన యేసే. మేకులు కొట్టబడిన ఆయన హస్తములు ఆయన మరణమును జయించాడనుటకు సుస్పష్టమైన ప్రదర్శనలై యుండినవి. ఆయన మరణించాడు, కానీ మృత్యుంజయుడై సమాధిలో నుండి వెలుపలికి వచ్చి ఇప్పుడు ఆయన శిష్యుల ముందర నిలువబడి యున్నాడు!

*మూడవదిగా మేకులు కొట్టబడిన యేసు హస్తములు మన రక్షకుడుగా ఆయనకు గల అధికారమును రుజువుచేశాయి.* యేసు వాక్కు మంచిదని ఈ హస్తములు సంపూర్ణ నిదర్శనము నిచ్చినవి. ఆయన చేసిన ప్రతి వాగ్దానము అవునన్నట్టుగానే విశ్వసనీయమైనది మరియు పూర్తిగా నమ్మదగినదై యున్నది. ఆయన సిలువవేయబడుననియు మూడవ దినమున ఆయన లేచుననియు ఆయన తన శిష్యులతో చెప్పాడు (మత్తయి 16:21). ఆయన హస్తములిప్పుడు, "నేను నా వాగ్దానమును నిలబెట్టుకున్నాను" అని చెప్పుచుండినవి అయన లోకమునకు నిజమైన మరియు సజీవుడైన రక్షకుడై యున్నాడు; ఆయన మృతులలో నుండి పునరుత్థానుడగుట దీనిని రుజువుచేయుచున్నది.

ఆయన మృతులలో నుండి లేచి సజీవుడై యున్నాడని వారిని ఒప్పించిన తరువాత, ఇక నుండి వారేమేమి చేయవలెనని ఆయన ఆశిస్తున్నాడో మరియు తరువాతి దినములలో

ఏమేమి జరుగునోయనియు ఆ యా విషయాలను వారికి చెప్పుటకు మొదలుపెట్టాడు. మేకులు కొట్టబడిన హస్తములతో ఆయన తన అధికారమును ధ్రువపర్చుకొనిన తరువాత వారికి ఆజ్ఞాపించుట ఆరంభించాడు. వారు ఆయనతో వాదోపవాదములు చేయలేదు. వారు, "మేము సువార్తను ఈ విశాల విశ్వమంతటికి ఎలా ప్రకటించగలము? మేము కొద్దిమందిమే కదా!" అని చెప్పలేదు. యేసు వారికిచ్చిన నిదర్శనము అప్పుడే మృతులలో నుండి లేచినవాడు వారు చేయవలెనని ఆయన కోరిన సమస్త పనులను చేయగలుగుటకు ఆయన వారికి అధికారమియ్యగలడని వారెరుగునంతగా సంపూర్ణమైనదై యుండినది.

*నాల్గదిగా, మేకులు కొట్టబడిన ఈ హస్తములు రక్షణ ఊరకనే రాలేదు కానీ అందుకు అవసరమైన మూల్యము బలియాగము ద్వారా చెల్లింపబడినదని రుజువుచేశాయి.* చౌకబారు రక్షణ అనునది లేనేలేదు. మేకులు కొట్టబడిన హస్తములు, మేకులు కొట్టబడిన పాదములు మరియు ప్రక్కలోని బల్లెపు పోటు ద్వారా మాత్రమే నిత్యజీవము ప్రాప్తించబడగలదు. మేకులు కొట్టబడిన యేసు హస్తములను చూచిన ప్రతివాడును మనస్సు మారకుండా ఎన్నడునూ తన మనుగడ కొనసాగించజాలడు. పౌలు, "జీవించువారికమీదట తమకొరకు కాక, తమ నిమిత్తము మృతిపొంది తిరిగి లేచినవాని కొరకే జీవించుటకు ఆయన అందరికొరకు మృతినొందెను" అని వ్రాస్తున్నాడు (2 కొరింథీయులకు 5:15).

సిలువ మనకు రక్షణ మార్గమును మాత్రమే నివేదించుటలేదు, కానీ క్రైస్తవ జీవితము యొక్క యథార్థమైన స్వభావమును మనము కంటికి ఎదురుగా ఉన్నట్లు మన మనస్సుల్లోనికి తెచ్చుకొనుటకు మనకు సహాయము కూడా చేయును. మనము క్రీస్తుకే అంకితమై ఆయననే అంటిపెట్టుకొని ఆయన రాజ్య విస్తరణ సేవలో నిమగ్నమై యుండునట్లు సిలువ నిస్ఫోటకమైన విధానములో మనకు ప్రోత్సాహమును కలిగించును. యేసు కేవలము తన గాయముల మచ్చలను చూపిస్తే చాలు, ప్రజలు ఆయన నిమిత్తము హతసాక్షులుగా మరణించుటకు వెనుకంజవేయరు. బహుశ గాయపర్చబడిన ఆయన హస్తములను చూచినంత వరకు శిష్యులు ఈ సత్యమును అర్థంచేసికొని యుండకపోవచ్చును. ఆయన, "ఎవడైనను నన్ను వెంబడింపగోరిన యెడల, తన్నుతాను ఉపేక్షించుకొని, తన సిలువనెత్తికొని నన్ను వెంబడింపవలెను" అని వారితో చెప్పాడు (మత్తయి 16:24). శిష్యులు ఈ మాటలు గ్రహించారా? ఈ మాటల ప్రాముఖ్యతను వారు గమనించారా? మేకులు కొట్టబడిన ఆయన హస్తములను చూచిన తరువాత ఖచ్చితంగా గ్రహించారు. గమనించారు. అటుతరువాత, పౌలు, "ఇప్పుడు మీకొరకు నేను అనుభవించుచున్న శ్రమల యందు సంతోషించుచు, సంఘము అను ఆయన శరీరముకొరకు క్రీస్తు పడినపాట్లలో కొదువైన వాటియందు నా వంతు నా శరీరమందు సంపూర్ణము చేయుచున్నాను" అని వ్రాయుచున్నాడు (కొలొస్సయులకు 1:24). క్రీస్తును వెంబడించుట అనంటే తరుచుగా శ్రమయే అని పౌలు తెలిసికొన్నాడు; ఇతరులకు రక్షణ సందేశాన్ని అందించుటకు ఒకరు తన జీవితాన్ని అర్పించుకొనుట అని దాని అర్థం. ఆయనను వెంబడించవలెనని యేసు అందించుచున్న ఆహ్వానము ఆయన నామము నిమిత్తము శ్రమలు అనుభవించుటకు అందించబడుచున్న ఆహ్వానమై యుండునని మనము జ్ఞాపకముంచుకొందాము. రక్షణ తేలికైన విషయం కాదు లేదా ఎటువంటి బాధలేకుండా పొందుకొనలేము. క్రీస్తు కొరకు ఒక ఆత్మ సంపాదింపబడినప్పుడెల్లా, సమీపంలోనే ఒక రక్తము చుక్క కనబడుతుంది.

ప్రభువా, పాటుపడుచు నేను అలసిపోయినప్పుడు,
నీ ఆజ్ఞలు భారమైనవిగా అగుపించినప్పుడు,
నా భారము అసంతృప్తిని ఆవేదించునదైనప్పుడు,
ప్రభువా, నీ హస్తములను నాకు చూపించు –
మేకులు కొట్టబడిన నీ హస్తములు, సిలువచించిన నీ హస్తములు,
నా రక్షకా, నీ హస్తములు నాకు చూపించుము.

క్రీస్తూ, ఎప్పుడైనా నా అడుగులు తడబడనట్లయితే,
వెనుదిరుగుటకు నేను సిద్ధపడినట్లయితే,
ఎడారి గాని ముళ్లు గాని నన్నేడిపించినట్లయితే,
ప్రభువా, నీ పాదములు నాకు చూపించుము –
రక్తముకారుచున్న నీ పాదములు, మేకుల గాయములుగల నీ పాదములు,
నా యేసూ, నీ పాదములు నాకు చూపించుము.

ఓ దేవా, నీకు చూపించుటకు నేను సాహసించలేను
నా హస్తములను, నా పాదములను?[1]

గాయముల వలన ఏర్పడిన మచ్చలతో, ఆయన గుర్తింపును మరియు పునరుత్థాన జీవితమును చూచిన పదిమంది అపొస్తలులను మరియు ఇతర శిష్యులను యేసు ఒప్పించాడు. ఒక వారము రోజుల తరువాత, ఆయన మచ్చలు అపనమ్మకముతో నిండియుండిన తోమాను నమ్మకముతో నింపినవి, అప్పుడతడు, "నా ప్రభువా, దేవా!" అని అన్నాడు (యోహాను 20:28). యేసు హస్తములు, పాదములు, మరియు ఆయన ప్రక్క మనకు ఆయన జయించిన పరలోకమునకును ఇహమునకును మధ్య గల సమాధానము గూర్చి చెప్పుచున్నవి, ఆయనను సేవ, త్యాగము, మరియు నిష్ఠా భావముతో వెంబడించవలెనను ఆశ్చర్యకరమైన ఆయన పిలుపును అవి జారీ చేస్తాయి. "ఆయన వారికి తన చేతులను ప్రక్కను చూపెను" అను ఈ పదజాలములో గూఢార్థము గూర్చి ఇప్పుడే, ఈనాడే కొంచెమాలోచించుము (యోహాను 20:20ఎ).

❖•❖•❖

*యేసే క్రీస్తు అని నీవు ఒప్పింపబడనట్లయితే, లేదా నీ ప్రేషణమేమిటో నీకు తెలియనట్లయితే, మేకులు కొట్టబడిన ఆయన హస్తములను చూడుము.*

---

సూచన

[1]Brenton Thoburn Badley, "Show Me Thy Hands" (http:/wwwjoyfulministry.com/handsf.htm; Internet; accessed 2 January 2007).